సాక్షి అనకాపల్లి

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



పాలనా తీరు గమనించండి

సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి హయాంలో డ్వాక్రా మహిళలకు మేలు జరిగిందని మంత్రి అమర్‌నాథ్ అన్నారు. 8లో



నేడే అప్పన్న కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం సింహగిరిపై వైభవంగా జరగనుంది. 8లో



వీఎంఆర్డీఏ కార్యదర్శిగా..

విశాఖ: వీఎంఆర్డీఏ కార్యదర్శిగా రంగయ్య బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు.



పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- జిల్లా నుంచి 23,913 మంది విద్యార్థులు
- 111 సెంటర్ల ఏర్పాటు.. 5 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- ప్రత్యేక తనిఖీ బృందాల నియామకం
- రేపు ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలు

సాక్షి, అనకాపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 3వ తేదీ నుంచి 18 వరకు జరగనున్న పరీక్షలకు జిల్లాలో 22,232 మంది రెగ్యులర్, 1,681 మంది ప్రైవేటు (వన్స్ ఫెయిల్డ్) విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్షల నిర్వహణకు 111 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి కేంద్రంలో వసతి, ఫర్నిచర్, టాయిలెట్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి సౌకర్యంతోపాటు, అన్ని కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్ చూపించి విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు.

సమస్యాత్మక కేంద్రాలపై ఫోకస్

జిల్లాలో 111 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇందులో ఏ- కేటగిరీ కింద 33, బీ- కేటగిరీ కింద 51, సీ-కేటగిరీ కింద 27 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సమస్యాత్మకంగా కేంద్రాలుగా ఐదింటిని గుర్తించారు. ఈ ఐదింటిపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. పరీక్షల నిర్వహణకు 111 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 111 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించారు.

ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

జిల్లాలో బఫర్ స్టోరేజ్ పాయింట్‌గా ఏఎంఎంఏ ప్రభుత్వ హైస్కూల్‌ను ఎంపిక చేశారు. ఇక్కడే



స్పాట్ వాల్యుయేషన్ కూడా జరగనుంది. ఇక్కడే కట్టుదిట్టమైన భద్రత నడుమ పరీక్షల సామగ్రిని కేంద్రాలకు చేరవేశారు.

మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈసారి ప్రశ్నాపత్రాలపై ప్రత్యేక గుర్తింపు నంబర్‌ను ముద్రించారు. ప్రశ్నాపత్రం ఎక్కడ నుంచి బయటకు వచ్చిందనేది గుర్తించేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. రెవెన్యూ, పోలీస్, విద్యా విభాగాల నుంచి ఒక్కొక్క అధికారి వీటిలో సభ్యులుగా ఉంటారు. పరీక్ష జరిగే రోజుల్లో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. జెరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు ఇచ్చారు.

3 నుంచే ఓపెన్ పరీక్షలు

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కూడా ఈనెల 3వ తేదీన ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. జిల్లాలో 4 ఓపెన్ టెన్త్ పరీక్ష కేంద్రాల్లో 818 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 9 ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో 1971 మంది పరీక్షలు రాయనున్నారు.

సకల సౌకర్యాలు



పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి. ఎలక్ట్రానిక్ వాచ్, ఇతర వస్తువులు తీసుకురాకూడదు. పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకు అనుమతిస్తాం. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు విద్యా, రెవెన్యూ, ఆర్టీసీ, పోలీస్, మెడికల్ విభాగ అధికారుల సహకారం తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ తదితరాలతో మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంటాయి. పరీక్ష సమయానికి రెండు గంటల ముందు, రెండు గంటల తర్వాత వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేలా చూడమని ప్రజా రవాణా శాఖను కోరాం.

–వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి నర్సీపట్నం కోర్టుల సందర్శన



ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపీని సత్కరిస్తున్న న్యాయవాదులు

నర్సీపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి శనివారం స్థానిక న్యాయస్థానాలను సందర్శించారు. న్యాయమూర్తులు టి.లీలావతి, ఎస్.రెడ్డి ప్రసన్న, మధుసూదన్‌రావు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలికారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు నర్సీపట్నంలో అదనపు జిల్లా న్యాయస్థానం ఆవశ్యకతతోపాటు పలు సమస్యలను న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు.

లేగ దూడలకు డీవార్మింగ్ మందు



లేగదూడలకు డీవార్మింగ్ మందు వేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

కె.కోటపాడు: ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం కె.కోటపాడులో లేగదూడలకు డీవార్మింగ్ మందు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశుసంవర్థకశాఖ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వయంగా లేగదూడకు మందు వేశారు. లంకవానిపాలెం పీహెచ్‌సీకి సంబంధించిన 104 వాహనాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి డిప్యూటీ సీఎం ప్రారంభించారు.

మూడో విడత ఆసరా కార్యక్రమం సందర్భంగా ఐసీడీఎస్, వెలుగు, పశుసంవర్థక తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు. ఐసీడీఎస్ పీవో మంగతాయారు, పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి, పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు భరోసా

- వివిధ పథకాలతో బంగారు బాటలు వేసిన సీఎం జగన్
- ఉత్తమ ఫలితాలు సాధించి ఆయన కలను నిజం చేయాలి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- తెనుగుపూడి గురుకుల విద్యాలయం సందర్శన



తెనుగుపూడిలో గురుకుల విద్యాలయ ఎన్‌సీసీ విద్యార్థులతో మంత్రి నాగార్జున

దేవరాపల్లి: దేశంలో ఎక్కడా లేని విధంగా పేద విద్యార్థుల చదువుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిండైన భరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. తెనుగుపూడిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపావతి నేతృత్వంలో ఎన్‌సీసీ విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా విద్యాలయం ఆవరణలో మంత్రి మొక్కలను నాటారు. విద్యార్థులను కలిసి విద్యాబోధన, భోజనం ఎలా అందిస్తున్నారని ఆరా తీశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)ను సందర్శించి విద్యార్థులు తయారు చేసిన నమూనా ప్రాజెక్టులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులకు స్థానిక పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను సమకూర్చిన పరీక్ష మెటీరియల్‌ను మంత్రి నాగార్జున అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ పరీక్షలంటే భయాన్ని వీడి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి ఉన్నత ఫలితాలను సాధించాలన్నారు. పేదల తలరాతను మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని భావించి అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ దీవెన పేరిట ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఉన్నత చదువులకు ముఖ్యమంత్రి బంగారు బాటలు వేశారన్నారు. మంచి ఫలితాలు సాధించి, ఆయన కలను నిజం చేయాలన్నారు. మంత్రిని డీసీవో రూపావతి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. దేవరాపల్లి అంబేడ్కర్ యూత్ సంఘ నాయకులు సబ్బవరపు మాలిబాబు, కంచిమాల అప్పారావు మంత్రిని సన్మానించారు. స్థానిక ప్రిన్సిపల్ సిహెచ్. రవీంద్రనాథ్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమనీయం...రాములోరి కల్యాణం

కొత్తపేట రామాలయంలో నేత్రపర్వంగా వార్షిక కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న న్యాయమూర్తుల దంపతులు

యలమంచిలి: కొత్తపేట పురాతన రామాలయంలో సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు సంప్రదాయబద్ధంగా కల్యాణ కృతువు నిర్వహించారు. ఈ ఉత్సవంలో న్యాయమూర్తుల దంపతులు పాల్గొనటం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవ విగ్రహాలకు విశేష అలంకరణ చేసి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. యలమంచిలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతి భవాని దంపతులు, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ టి.వీరరాఘవేంద్రరావు దంపతులు, యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారిలతో అర్చకులు సీతారాముల కల్యాణాన్ని జరిపించారు.

అనకాపల్లి పాలిటెక్నిక్‌కు అరుదైన ఘనత

- ఎన్‌బీఏ గుర్తింపుతో విద్యార్థులకు మంచి అవకాశాలు
- ఈసీఈ, కంప్యూటర్ డిప్లమో కోర్సుల నిర్వహణకు ప్రశంసలు
- వాషింగ్టన్ అక్కార్డ్‌లో స్థానం



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



కళాశాలలో పర్యటించిన ఎన్‌బీఏ బృందం (ఫైల్)

తుమ్మపాల: అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సులకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. దీంతో కళాశాలకు అటానమస్ హోదా పొందనుంది. ఇక్కడ చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. కళాశాల యాజమాన్యం 2022లో దరఖాస్తు చేయగా, ఎన్‌ఏబీ బృందం ఈ ఏడాది జనవరి 6 నుంచి మూడు రోజులపాటు కళాశాలలో పర్యటించింది. అత్యుత్తమ బోధన ప్రమాణాలను, వసతులను పరిశీలించి కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ), కంప్యూటర్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సులకు గుర్తింపు ఇచ్చినట్లు మార్చి 29న మెయిల్ ద్వారా ప్రిన్సిపల్‌కు సమాచారం అందించారు. దీంతో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి కేంద్రంగా ఏర్పడిన కొత్త జిల్లాలో గల ఈ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించింది. టెక్నికల్ లాబ్స్‌తో కూడిన వివిధ రకాల విభాగాలతో కళాశాలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

వాషింగ్టన్ అక్కార్డ్‌లో స్థానం

వాషింగ్టన్ అక్కార్డ్ అనేది ఇంటర్‌నేషనల్ డిప్లమో. అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్ ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించిన అగ్రిమెంట్. ఎన్‌బీఏ గుర్తింపుతో ఈ కళాశాల వాషింగ్టన్ అక్కార్డ్‌లో స్థానాన్ని సంపాదించుకుంది. వాషింగ్టన్ అక్కార్డ్ 1989లో ఏర్పాటైంది. ఇంటర్‌నేషనల్ గ్రాడ్యుయేట్ ప్రొగ్రాంల ద్వారా ఇంజనీరింగ్ విద్యలో నైపుణ్యాలను, జ్ఞానాన్ని, సామర్థ్యాలను పెంపొందించి గ్లోబల్ క్వాలిటీ ఇంజనీర్లను తయారుచేసి ఉపాధి అవకాశాలు అందించడమే దీని ముఖ్య లక్ష్యం. వాషింగ్టన్ అక్కార్డ్‌లో ఇండియా 17వ దేశంగా ఉంది. అమెరికా వంటి అగ్రదేశాలతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, తైవాన్, హాంగ్‌కాంగ్, ఐర్లాండ్, జపాన్, మలేషియా, కొరియా, న్యూజిలాండ్, రష్యా, సింగపూర్, సౌత్ ఆఫ్రికా, టర్కీ, శ్రీలంక తదితర దేశాలు ఇందులో సభ్యత్వం కలిగి ఉన్నాయి. ఇలాంటి ప్రతిష్టాత్మక గుర్తింపుతో ఈ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయంగా ఇంజనీరింగ్‌లో నైపుణ్యాలు, సామర్థ్యాలు పెంచుకునే అవకాశం లభించింది.

ఆనందంగా ఉంది



ఎన్‌బీఏ గుర్తింపుతో మా కళాశాల అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందడం ఆనందంగా ఉంది. అత్యుత్తమ బోధన ప్రమాణాలు పాటించడంతో మా కళాశాలకు మంచి గుర్తింపు లభించింది. ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి అభినందనలతో సందేశం పంపించారు. విద్యార్థులకు అంతర్జాతీయ నైపుణ్యాలు పొందేందుకు చక్కటి అవకాశం కలిగింది.

–ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్

పాలనా తీరును గమనించండి

- పసుపు కుంకుమతో చంద్రబాబు మోసం
- వైఎస్సార్ ఆసరాతో మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- తుమ్మపాలలో వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ



సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు చూపుతున్న మహిళలు



లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: గతంలో చంద్రబాబు, ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు వ్యత్యాసాన్ని డ్వాక్రా మహిళలు గమనించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. అనకాపల్లి మండలం తుమ్మపాల బంగారాజు కల్యాణ మండపం వద్ద శనివారం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. మంత్రి అమర్‌నాథ్‌పై మహిళలు పూలవర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మంత్రితోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మహిళలనుద్దేశించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికల హామీ మేరకు డ్వాక్రా మహిళలందరికీ విడతల వారీగా రుణమాఫీ చేయడంతోపాటు సున్నా వడ్డీ చెల్లిస్తున్నారన్నారు. మిగిలిన ఒక వంతు డబ్బును వచ్చే ఏడాది చెల్లించిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామన్నారు. గతంలో 2014 ఎన్నికల ముందు చంద్రబాబు రుణమాఫీ చేస్తానని ప్రకటించి సవాలక్ష కొర్రీలతో హామీని గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల ముందు పసుపు కుంకుమ సెంటిమెంట్‌తో రూ.10 వేలు ఇచ్చారన్నారు. మహిళలు వాస్తవాలు గమనించి టీడీపీని ఓడించారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టో మొత్తం అమలు చేసిన ఘనత ఒక్క వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఏటా సంక్షేమ కేలండర్ ప్రకటించి పథకాలు అమలు చేస్తున్న నిబద్ధత కలిగిన నేతగా ఖ్యాతినార్జించారన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చి గతంలో ఏ ప్రభుత్వాలూ చేయనంతగా పెద్ద మొత్తంలో వేల కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి, సంక్షేమాన్ని చేపడుతున్న సీఎం జగన్‌కు అందరూ మరోసారి మద్దతుగా నిలబడాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా పెద్దఎత్తున తరలివచ్చిన అక్కచెల్లెమ్మలతా థాంక్యూ సీఎం సార్ నినాదాల నడుమ సీఎం చిత్రపటానికి మంత్రి, ప్రజాప్రతినిధులు, మహిళలు క్షీరాభిషేకం చేశారు. పలువురు మహిళలు థాంక్యూ సీఎం సార్ స్లోగన్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం మండలంలో గ్రామీణానికి చెందిన 1,863 సంఘాల్లో 19,478 మంది మహిళలకు రూ.13.99 కోట్లను మహిళల ఖాతాలకు జమ చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. మూడు విడతల్లో ఇప్పటివరకూ రూ.41.89కోట్లు లబ్ధి చేసినట్టు వివరించారు. డీఆర్‌డీఏ పీడీ బి. లక్ష్మీపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకుమారి, ఐతా రాము, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, రామ్మూర్తి, జోసెఫ్, డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ వి. ధర్మారావు, కె.కుమారస్వామి, ఏపీఎం కె. నీలాచలం పాల్గొన్నారు.



కె.కోటపాడులో ఆసరా లబ్ధిదారులకు నమూనా చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడిలో సీఎం చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న విప్ కరణం ధర్మశ్రీ

లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



తుమ్మపాల: గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల నిర్ధారణకు వినియోగించే యంత్రాలతో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా నిరోధించాలన్నారు. అటువంటి వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఆడపిల్లలు తక్కువగా ఉన్న మండలాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అధికారులు విధిగా స్కానింగ్ కేంద్రాలను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు.

కవర్ల వినియోగంతో పండ్లకు రక్షణ

జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు



మాట్లాడుతున్న ప్రభాకరరావు

కె.కోటపాడు: పక్వానికి రాకముందే చెట్లపై మామిడి కాయలకు కవర్లను తొడగటం వల్ల క్రిమికీటకాల నుంచి రక్షించుకోవచ్చునని జిల్లా ఉద్యానవనశాఖాధికారి ప్రభాకరరావు తెలిపారు. శనివారం కింతాడలో మామిడి సాగు రైతులకు అవగాహన కల్పించారు. చెక్క గుజ్జుతో తయారైన పేపర్ కవర్ కాయకు మంచి రక్షణ కలిగిస్తుందన్నారు. పండ్లను అధిక సూర్యరశ్మి నుంచి రక్షించడంతోపాటు వడగండ్ల వాన నుంచి కాపాడుతుందని వివరించారు. మామిడికాయకు ఉండే సహజ మంచి లక్షణాలను పెంచుతుందన్నారు. మచ్చలు, మంచు పురుగు, ముడ్డి పుచ్చు, టెంక పురుగు, మకరం, ఈగలు వంటి వాటి నుంచి కాపాడుతుందన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, ఉద్యానవన శాఖాధికారులు కిరణ్మయి, గణేష్, ఏవో సోమశేఖర్, ఆర్బీకేల ఉద్యానవన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

నేడే అప్పన్న కల్యాణోత్సవం

- సాయంత్రం 6.30 గంటల నుంచి ఎదురుసన్నాహోత్సవం
- రాత్రి 8 గంటల నుంచి రథోత్సవం
- రాత్రి 9.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం

సింహాచలం: చైత్ర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరగనుంది. సింహగిరిపై నృసింహ మండపంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు నీలాద్రిగుమ్మం వద్ద అర్చకులు, ముత్తైవులు పసుపు కొమ్ములను దంచి కొట్నాలు ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారు పల్లకీలోను, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలో ఉంచి మాడ వీధుల్లో ఉంచి ఎదురు సన్నాహోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు సింహగిరి మాడ వీధుల్లో రథోత్సవాన్ని నిర్వహిస్తారు. రథోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను నృసింహ మండపంలోకి తీసుకెళ్లి అక్కడ భారీ ఎత్తున ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వేంజేపచేస్తారు. రాత్రి 9.30 గంటల నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు.

విశేషంగా ఏర్పాట్లు

- రథోత్సవం, కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో పలు శాఖల సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- నృసింహ మండపంలో భారీ ఎత్తున కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. పలు రకాల పుష్పాలు, భారీ విద్యుద్దీపకాంతులతో కల్యాణవేదికను అలంకరిస్తున్నారు.
- నృసింహ మండపంలో ఉన్న గార్డెన్‌లో కూర్చుని కల్యాణాన్ని తిలకించే విధంగా సాధారణ భక్తులకు మూడు గేలరీలు, వీఐపీలకు ఒక గ్యాలరీ ఏర్పాటు చేశారు.
- మొత్తం ఐదు పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసి అందులో కూడా భక్తులు కల్యాణాన్ని తిలకించే విధంగా ఏర్పాటు చేశారు.



విద్యుద్దీపకాంతులతో సింహగిరిపై రాజగోపురం

- 10 వేల చిన్న లడ్డులను, పదివేల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను ప్రసాదంగా అందించనున్నారు.
- మధ్యాహ్నం, రాత్రికి అన్నదాన భవనంలో 5 వేల మందికి చొప్పున అన్నప్రసాదాన్ని అందించనున్నారు.
- రెగ్యులర్ సీసీ కెమెరాలతో పాటు అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.
- ఆదివారం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో రెండు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

చిరుధాన్యాల విశిష్టుడు పీవీ సతీష్

సంతాప సభలో వక్తలు



మిల్లెట్స్ మాన్ పీవీ సతీష్‌కు నివాళులర్పిస్తున్న కర్రి జోగినాయుడు, తదితరులు

అనకాపల్లి రూరల్: ముప్పై ఏళ్ల క్రితమే చిరుధాన్యాల ప్రాధాన్యతను సమాజానికి తెలియజేసిన మహోన్నతుడు పీవీ సతీష్ మృతి అందరికీ తీరని లోటని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తుమ్మపాల శారదా వ్యాలీ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంస్థ కార్యాలయంలో మిల్లెట్స్ మాన్‌గా ఖ్యాతి పొందిన పీవీ సతీష్ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి కర్రి జోగినాయుడు, పలువురు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని పీవీ సతీష్ ప్రస్తుత సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. చిరుధాన్యాల సాగు, జీవ వైవిధ్యం, సంప్రదాయ సాగు పద్ధతులపై ఆయన మూడు దశాబ్దాల క్రితమే అందరికీ పరిచయం చేశారన్నారు. ప్రభుత్వాలు ప్రస్తుతం చిరిధాన్యాల సాగు, వాటితో చేసిన ఆహార పదార్థాల వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయని వివరించారు. ఇదంతా ఆయన చేసిన కృషి ఫలితమే అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు బుదిరెడ్డి నరసింహారావు, రైతులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

4న జోన్ పరిధిలో దుకాణాలకు బహిరంగ వేలం

అనకాపల్లిటౌన్: జోన్ పరిధిలో ఖాళీ వ్యాపార దుకాణాలు కల్యాణమండపాలు, చేపల బజారుకు ఈనెల 4వ తేదీన ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు జెడ్సీ పి.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాటలో పాల్గొనే వ్యక్తులు ముందుగా దుకాణానికి రూ. 20వేలు, కల్యాణమండపానికి రూ. 3లక్షలు, చేపలబజారుకు రూ.44 వేలు విశాఖ జీవీఎంసీ కమీషనర్ పేరు మీద డి.డి చెల్లించాలని సూచించారు.

పరిశుభ్రమైన తాగునీరు అందించాలి

అనకాపల్లిటౌన్ : జోన్ పరిధిలో కుళాయిల ద్వారా పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు అందించాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు కోరారు. గవరపాలెం తమ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు రోజులుగా తాగునీటి కుళాయిల ద్వారా బురద నీరు రావడం జరుగుతుందని, తాగునీటి విభాగం అధికారులు వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందుగా పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేగుల కృష్ణ అప్పారావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదవ హక్కుల పోరాట సమితి సమావేశం

కశింకోట : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అనకాపల్లి జిల్లా సమావేశం కొత్తూరు వద్ద సత్యనారాయణస్వామి దేవాల య ఆవరణలోని తోటలో ఆదివారం ఉద యం 9 గంటలకు ఏర్పాటు చేసినట్టు సమితి అధ్యక్షుడు వియ్యపు భూలోకనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న నియోజక వర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రధాన కమిటీలు, అనుబంధ కమిటీలు ఏర్పాటు చేసి నియామకపు పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశానికి సమితి అఖిల భారత ప్రధాన కార్యదర్శి మండేం సుభాష్ చంద్రబోస్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు (వర్కింగ్) ఇసరపు శేఖర్ యాదవ్, ఉపాధ్యక్షుడు పినబోయిన యాదవ్, ప్రధాన కార్యదర్శి కోరుకొండ వీరేంద్ర యాదవ్ తదితరులు హాజరవుతారన్నారు.

ఎంపీ నిధులతో తాగునీటి బోర్లు మంజూరు

కశింకోట : మండలానికి ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి తన ఎంపీ నిధుల నుంచి 13 మంచినీటి బోర్లు మంజూరు చేశారని ఎంపీపీ కలగా లక్ష్మి తెలిపారు. ఒక్కొక్కటి రూ.లక్ష వంతున రూ.13 లక్షలు మంజూరు చేశారన్నారు. కశింకోట, జమాదులపాలెం, మోసయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడ పాలెం గ్రామాలకు బోర్లు మంజూర య్యాయన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 6,933 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,030	4,320
మొదటి రకం	3,950	4,170
రెండో రకం	3,470	4,020
మూడో రకం	3,000	3,490

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 114 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-42 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్ 58 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 338 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

కలుషిత నీటి కష్టాలకు సెలవ్



బీసీ బాలుర వసతి గృహంలో ఆర్వో ప్లాంటు ప్రారంభిస్తున్న ఎంపీపీ సూరిబాబు



బాలికల వసతి గృహంలో ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ

- రెండు వసతి గృహాల్లో రూ.2.5లక్షలతో నీటిశుద్ధి ప్లాంట్ల ఏర్పాటు
- ప్రారంభించిన ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్ : వసతి గృహాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తెచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోంది. ఇప్పటికే వెనుకబడిన తరగతులు,సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఆరోగ్యకర సమాజం నిర్మాణం కోసం చక్కని పౌష్టికాహారాన్ని అందిస్తోంది. నాడు-నేడు పథకం ద్వారా వసతి గృహాల్లో చక్కని సౌకర్యాలు కల్పిస్తోంది. ఇటీవల మెనూ ధరలని సైతం పెంచింది. ప్రభుత్వ చర్యలకు ఊతమిస్తూ స్థానిక ప్రజాప్రతినిధులు కూడా వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు తమ వంతు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక బీసీ బాలుర, బాలికల వసతి గృహాల్లో రూ.2.50 లక్షల మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన రెండు ఆర్వో ప్లాంట్లను అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ రెండు వసతి గృహాలను పరిశీలించినపుడు రక్షిత తాగునీరు అందించడానికి కృషి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా తమవంతు కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులతో సమావేశమైన ఆయన ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఆర్వో ప్లాంట్ల మంజూరు చేసినందుకు విద్యార్థులు, సంక్షేమాధికారులు, సిబ్బంది ఎంపీపీకి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీడీవో కె. ధర్మారావు, హాస్టల్ ఇన్‌ఛార్జ్ సురేష్, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ బంధం అప్పలనాయుడు, సేనాపతి శ్రీనివాసరావు, కరణం సత్తిబాబు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందజేసే బాధ్యత సచివాలయాల ఉద్యోగులదే



సమావేశంలో మాట్లాడుతున్న జానకీరామరాజు

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ సకాలంలో అందించే విధంగా సచివాలయం ఉద్యోగులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు అన్నారు. విజయరామరాజుపేట 3,4,5 సచివాలయ ఆవరణలో శనివారం 82, 83 వార్డుల సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందలేని లబ్ధిదారులను సకాలంలో గుర్తించి అందజేసి వారి మన్ననలను పొందాలని ఆయన కోరారు. సచివాలయం ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలని, వలంటీర్లు వారి వారి పరిధిలో లబ్ధిదారుల సమస్యలను సచివాలయానికి తీసుకొని వచ్చినప్పుడు త్వరితగతిన పరిష్కరించాలని లేని పక్షంలో ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధార్‌కార్డులో జిల్లా పేరు మార్పు చేసుకోవాలని ఆయన కోరారు. 83వ వార్డు ఇన్‌ఛార్జీ జాజుల రమేష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన లబ్ధిదారులకు అందజేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. జగనన్న గృహ లబ్ధిదారులు అందరూ గృహాలు నిర్మించుకొనేందుకు ప్రభుత్వం మౌలిక సదుపాయలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో జెడ్సీ పి.వెంకటరమణ, జీవీఎంసీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఎంఈఓ
కె.చిట్టిబాబు

కశింకోట: మండలంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని ఎంఈవో కె. చిట్టిబాబు తెలిపారు. కశింకోటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 3 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నెల 18 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12-45 గంటల వరకు పరీక్ష జరగనుందన్నారు. పరీక్షల కోసం ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కశింకోటలోని డీపీఎస్ జిల్లా పరిషత్ హైస్కూలు, బాలికల హైస్కూలు, సెయింట్ జాన్స్ స్కూలు, తాళ్లపాలెంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాల, జెడ్పీ హైస్కూలు, నరసింగబిల్లి, కన్నూరుపాలెం హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలను గతంలో వలె ఏర్పాటు చేశామన్నారు.వీటిలో 1218 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 980 మంది విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల నుంచి 238 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. వీరిలో బాలికలు ఎక్కువ మంది ఉన్నారని, 675 మంది బాలికలు, 543 మంది బాలురు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

వైభవంగా లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం



కశింకోటలో నిర్వహిస్తున్న లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం



హాజరైన భక్త జనం

కశింకోట : కశింకోటలో శనివారం రాత్రి లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారల ఉత్సవ విగ్రహాలకు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వినాయక పూజ, రక్ష ధారణ, యజ్ఞోపవేతం, కన్యాదానం,శుభ ముహూర్తాన జీలకర్ర, బెల్లం పెట్టడం, మాంగళ్యధారణ, తలంబ్రాలు వేయడం, తదితర ఘట్టాలతో కమనీయంగా కల్యాణోత్సవం జరిగింది, ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై ఆసక్తిగా ఆద్యంతం కల్యాణాన్ని తిలకించారు.ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఉత్సవం సందర్భంగా స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారిని పూలమాలలు, వివిధ రకాల పూలు, నూతన వస్త్రాలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శించారు.

రేపు 'జగనన్నే మా భవిష్యత్తు'పై అవగాహన సదస్సు

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు 80, 81, 82, 83, 84 వార్డుల పరిధిలో సచివాలయాల కన్వీనర్లతో 'జగనన్నే మా భవిష్యత్తు' అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు జీవీఎంసీ సచివాలయాలు ఇన్‌ఛార్జులు మందపాటి జానకీరామరాజు, కొణతాల మురళీకృష్ణలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతున్నట్టు ఆయన చెప్పారు. కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, సచివాలయం కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

5న జగ్జీవన్‌రాం, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ



గుర్రం జాషువా కాలనీలో విగ్రహాల ఏర్పాటుపై కరపత్రాలతో ప్రచారం

కశింకోట: కశింకోటలోని గుర్రం జాషువా కాలనీలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కట్టుమూరి మంగరాజు తెలిపారు. విగ్రహాల నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఈ మేరకు కర పత్రాలు పంపిణీ చేసి శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి పురస్కరించుకొని ఆయనతో పాటు డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని, వీటిని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించనున్నారని చెప్పారు. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కట్టుమూర్తి సతీష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కర పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా దళిత బహుజన ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు కొల్లి చిన అప్పారావు, విగ్రహాల నిర్మాణ కమిటీ ప్రతినిధులు కొల్లి రామంజీ, వైరల అప్పారావు, చెవ్వేటి నాగరాజు, చెవ్వేటి ప్రకాష్, కొల్లి రమణ పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలి

- బవులువాడలో క్వారీ, క్రషర్ కార్మికుల ఆందోళన



కూలీ రేట్లు పెంచాలంటూ ఆందోళన చేస్తున్న క్వారీ, క్రషర్ కార్మికులు

అనకాపల్లి రూరల్: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా తమ కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి జిల్లకు చెందిన క్వారీ,క్రషర్ కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని బవులువాడ డ్రిల్లర్స్ కాలనీలో ఈ మేరకు నిర్వహించిన కూలీల సమావేశంలో తీర్మానించారు. ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 11వ వేతన ఒప్పందం ప్రకారం యాజమాన్యాలు చర్చలకు రావాలని లేని పక్షంలో భవిష్యత్తులో తమ పోరాటాన్ని మరింత ఉధృతంగా చేపడతామని కూలీలు హెచ్చరించారు. ఇప్పటికే 10వ వేతన ఒప్పందం గడువు ముగిసి నెల రోజులైందని నోటీసులిచ్చినా యాజమాన్యాలు స్పందించక పోవడం దారుణమని ఏఐఎఫ్‌టీయూ జిల్లా నేత కోన మోహనరావు ఆరోపించారు. శానాపతి సూర్యారావు, దాడి జగ్గారావు, అప్పలనాయుడు, సుభాష్, రమేష్, పుల్లేటి శ్రీను పాల్గొన్నారు.

గ్రామ కంఠం భూములకు త్వరలో రీ సర్వే

కశింకోట : గ్రామ కంఠం భూములకు కూడా త్వరలో రీ-సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె. సురేష్‌నాయుడు తెలిపారు. కశింకోటలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ కంఠం భూములు రెవెన్యూకు సంబంధించినవేనన్నారు. వీటి సర్వే వేరుగా నిర్వహించనున్నారని, ఇందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రీ-సర్వేలో తప్పులు ఉంటే సవరించుకోవడానికి ఏడాది వరకు సమయం ఉంటుందన్నారు. వివరాల నమోదులో పొరపాట్లు దొర్లితే తమ దృష్టికి తీసుకు వస్తే విచారించి న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు.మండలంలోప్రస్తుతం పంట భూముల రీ-సర్వే జరుగుతుందన్నారు. 22 గ్రామాల్లో ఈ నెల 15 వరకు మొదటి విడత సర్వే చేస్తున్నామన్నారు. అనంతరం మరో 5 గ్రామాల్లో సర్వే ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. తీడలో త్వరితగతిన రీ-సర్వే చేపట్టాలని సర్పంచ్ చిరికి సత్యనారాయణ కోరగా, అందుకు రెండో విడతలో ప్రారంభిస్తామని తహసీల్దార్ బదులిచ్చారు. అలాగే చెరకాం గ్రామంలో 1977లో ఇచ్చిన సుమారు 250 ఎకరాల డి ఫారం పట్టా భూములకు సర్వే జరగక హక్కుదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీని సర్వే చేపట్టి రికార్డుల్లో ఇప్పటికైనా నమోదు చేయాలని సర్పంచ్ వెన్నెల దేముళ్లు కోరారు. గతంలో పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ప్రయోజనం లేకపోయిందని, రీ-సర్వేలో అయినా సమస్య పరిష్కరించాలన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు కూడా తీడలో డీ ఫారం పట్టా భూముల సమస్యతోపాటు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. తాళ్లపాలెం ప్రాంతంలో గెడ్డను, వైఎస్సార్ లే-అవుట్ ప్రాంతంలో స్థలాన్ని ఆక్రమించి కంచె వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని కోరారు.

నీటిపారుదల శాఖ ఒకే సెక్షన్ పరిధిలోకి తేవాలి: మండలంలో నీటిపారుదల శాఖ పరిధి అటు అనకాపల్లి, ఇటు యలమంచిలి సెక్షన్ల పరిధిలో విస్తరించి ఉందని, దీనివల్ల ఈ ప్రాంతం ఏ సెక్షన్‌లో ఉందో తెలియక పనులు చేపట్టక రైతులు సతమతమవుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ దృష్ట్యా ఒకే సెక్షన్ పరిధిలోకి తేవడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు కోరుతూ చేసిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ సంపతిపురం వద్ద ఉన్న భారీ రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామాల్లో రక్షిత పథకాలకు బురద నీరు సరఫరా అవుతుందని, దీన్ని నివారించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కశింకోట గ్రామానికి ఇంటింటి కుళాయిలకు సరఫరా చేసే సంపతిపురం భారీ నీటి పథకం నుంచి సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి తెలిపారు. ఈ విషయమై ప్రాజెక్టు , ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, వైస్ ఎంపీపీ పర్యవేక్షించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ లక్ష్మి సూచించారు. మోసయ్యపేట గ్రామంలో నాటుసారా అమ్మకాలు అరికట్టాలని సర్పంచ్ మిస్కా రాజేశ్వరి కోరారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు యల్లపు వరలక్ష్మి, చెవ్వేటి చంద్రమ్మ, నడిపల్లి గంగాభవాని, సర్పంచ్‌లు కోన అరుణ, నాగమణి, కరక రాజ్యలక్ష్మి సమావేశంలో పాల్గొన్నారు.

చిరుధాన్య వంటకాలతో వ్యాధినిరోధక శక్తి



పోషక పక్వాడా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉషారాణి

అనకాపల్లిటౌన్ : పోషక విలువతో కూడిన చిరుధాన్యాల వంటకాలు తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉషారాణి అన్నారు. స్థానిక గవరపాలెం జగన్నాథస్వామి ఆలయంలో శనివారం పోషక పక్వాడా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు చిరుధాన్య వంటకాలు తీసుకోవడం ద్వారా వ్యాధినిరోధశక్తి పెంచుకోవచ్చన్నారు. షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెట్టవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ప్రభావతి, అగ్రికల్చర్ అధికారి విజేత, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ టి.దాసు, 80వవార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, సూపర్‌వైజర్లు, అగన్‌వాడీలు పాల్గొన్నారు.

పరీక్షల సమయాన్ని మరో పదినిమిషాలు పెంచాలి

అనకాపల్లిటౌన్: టెన్త్ విద్యార్థులకు పరీక్షా కాల సమయాన్ని మరో పదినిమిషాలు పెంచాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు వారు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. సమయానికి హాజరుకాని విద్యార్థుల భవితవ్యం దెబ్బతినకండా మరో పది నిమిషాలు పెంచాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కౌలుకు సీతారాముల ఆలయ భూములు

మునగపాక : మునగపాక సీతారాముల ఆలయ భూములను శనివారం కౌలుకు తీసుకున్న రైతుకు సంబంధిత అధికారులు అప్పగించారు. గత నెల 28న మునగపాక సీతారాముల ఆలయ భూములకు సంబంధించి కౌలుకు వేలంపాట నిర్వహించిన సంగతి తెలిసిందే. దీంతో సంబంధిత భూమిని దేవాదాయ శాఖ ఈవో మూర్తి, సర్వేయర్, వీఆర్వోలు కౌలుకు పాడిన రైతుకు అప్పగించారు. తోటాడ రెవెన్యూ సర్వే నంబర్ 283/1లో 1.50 సెంట్లు, 283/3లో 1.09 సెంట్లు గంగాదేవిపేటకు చెందిన మొల్లేటి రామచంద్రరావుకు కౌలుకు అప్పగించినట్టు మూర్తి తెలిపారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ నిరసన



స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి మద్దతుగా నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నేతలు

అనకాపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మిక,ప్రజా సంఘాలు చేపడుతున్న ఉద్యమం 700 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు నిరసన తెలిపారు. ఉక్కు కర్మాగరం ప్రైవేటీకరణను నిరసిస్తూ చేపడుతున్న ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతుందని, కార్మికుల ఆగ్రహానికి కేంద్ర పెద్దలు గద్దె దిగక తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ హెచ్చరించారు. కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. వంట గ్యాస్, డీజిల్, పెట్రో ధరలు విపరీతంగా పెంచుకుంటూ పోవడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేనంతగా పెరిగిపోతున్నాయని అన్నారు. సీఐటీయూ జిల్లా నేత కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు శ్రీ రామదాసు, అబ్బులు, భద్రం, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమస్తు నిరుపేదలకు వరం



చెక్కు అందిస్తున్న కొణతాల నీలిమ

అనకాపల్లిటౌన్: కల్యాణమస్తు పథకం నిరుపేదలకు వరంలాంటిదని 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ అన్నారు. అంబేడ్కర్ నగర్ 23 సచివాలయంలో ఇటీవల వివాహం చేసుకున్న వేల్పుల పుణ్యవతి, ప్రశాంత్ జంటకు ఆమె శనివారం రూ.50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నీ పేదలకు శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వామపక్షాల నిరసన



నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

అనకాపల్లిటౌన్ : ఆదానీ ఆర్థిక కుంభకోణంపై పార్లమెంట్ సమావేశంలో గళం ఎత్తినందుకే రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రధాని మోదీకి తగదని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఐఆర్.గంగాధర్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌కు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వామపక్షాలు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ నియంత పాలనకు వ్యతిరేకంగా దేశంలో లౌకికశక్తులు ఏకమవతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు పి.ఎస్.అజయ్‌కుమార్, బాలకృష్ణ, కొణతాల హరనాథబాబు, కాంగ్రెస్‌పార్టీ నేతలు పాల్గొన్నారు.

రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

నక్కపల్లి : జిల్లాలో రైతులంతా పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి(అగ్రికల్చర్ జేడీ) కె. మోహన్‌రావు తెలిపారు. శనివారం ఆయన నక్కపల్లి మండలంలో పనిచేస్తున్న ఆర్‌బీకేల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు అందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని అన్నారు. ఈకేవైసీపై ఆర్‌బీకే సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్ యాప్ పనితీరును మెరుగు పరచాలన్నారు. వేసవిలో చిరుధాన్యాలను వేసుకు నేలా ప్రోత్సహించాలన్నారు. ఖరీఫ్‌లో వేస్తున్న పంటలు క్రాప్ బుకింగ్‌కి ప్రణాళిక వేసుకోవాలన్నారు. కియోస్కా పనితీరు వైఎస్సార్ యంత్ర సేవ గురించి ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన కల్పించి అవి పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. నక్కపల్లి మండలంలో14564 మందికి పీఎం కిసాన్ పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. సుమారు 2017 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోకపోవడం వల్ల లబ్ధి పొందలేదన్నారు. వలంటీర్ల సాయంతో రైతులందరికి ఈకేవైసీ చేయాలన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవాలు ప్రారంభం



నక్కపల్లిలో ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ప్రాచీన శివాలయం ఉపమాకలో ఉన్న భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు శనివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ఐదురోజుల పాటు ఈ కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు దేవదాయ శాఖ ఆలయ పాలకవర్గం నిర్ణయించింది. శనివారం అంకురార్పణ నిర్వహించారు. ఉపమాక వేంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శివాలయం అర్చకులు వెలవలపల్లి మహేశ్ల అధ్వర్యంలో ధ్వజారోహణం, హోమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా నక్కపల్లి తీసుకెళ్లారు. శింగంశెట్టి నానీ కుటుంబీకుల ఆధ్వర్యంలో మైలవర భట్ల జోగారావు, మంచిరాజు వీరభద్రరావు(సహరా పంతులు) ఇంటి వద్ద ఎదురు సన్నాహమహోత్సవం ఘనంగా నిర్వహించారు. సప్పరం వాహనంపై పరమేశ్వరుడ్ని, పల్లకిలో అమ్మవారి ఉత్సవమూర్తులను ఉంచి నక్కపల్లి తీసుకు వచ్చారు. అక్కడ ఎదురు సన్నాహమహోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవాల సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం స్వామివారి ప్రాశస్త్యాన్ని వివరించిన డాక్టర్ వేదాల గాయత్రీదేవిని ఘనంగా సన్మానించారు. కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఈవో మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.